క్లుప్తంగా

విధుల్లో చేరిన పలువురు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు

తాడికొండ: మండలంలో పలువురు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం త్వరలో జీతాలు పెంపుపై ప్రకటన చేస్తామని, అప్పటి వరకు విధుల్లో చేరాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీచర్లు, ఆయాలు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు సంబంధిత స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమాచారం అందించారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో పలువురు విధుల్లో చేరారు. యూనియన్ల నుంచి ఒత్తిడి ఎదురవుతున్న నేపథ్యంలో బహిర్గతం కాకుండా విధుల్లో పాల్గొంటున్నారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంగళగిరి: రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వం ఏర్పాటైనా స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం స్వర్ణకారులకు రెండు వేయింగ్ మిషన్లు, 35 మందికి పనిముట్లు, 100 గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు కార్పొరేషన్ నిధులు అందకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని కుటీర పరిశ్రమలు నడుపుతూ నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించి స్వర్ణకార పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొల్లి గిరి, జింక దివ్య నారాయణ, ధనాలకోటి వాసు, యు. నాగేంద్రకుమార్, మంద్రు సత్యనారాయణ పాల్గొన్నారు.

సందడిగా ప్రెషర్స్ డే వేడుకలు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధి చింతలపూడిలోని ప్రియదర్శిని కళాశాలలో ప్రెషర్స్‌డే వేడుకల్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న తెనాలి డీఎస్పీ జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థులు తమకంటూ లక్ష్యాన్ని నిర్ణయించుకుని నిరంతరం శ్రమించి దాన్ని సాధించాలని తెలిపారు. విద్యార్థి దశ చాలా సున్నితమైనదని వారి లక్ష్యాలను తల్లిదండ్రులు అడిగి తెలుసుకోవాలని, తమ అభిప్రాయాలను వారిపై మోపవద్దని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్స్ ఎ. రామారావు, డిప్లొమా ప్రిన్సిపాల్ బి. విష్ణు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో యువకుడు, యువతి అదృశ్యం

తాడేపల్లి రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో యువకుడు, యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. యస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... డోలాస్‌నగర్‌కు చెందిన జ్యోతి పెద్ద కుమారుడైన వేల్పుల రవితేజ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 16న స్నేహితులైన బత్తుల రాజేష్, సతీష్‌లతో కలసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితుల్ని అడిగితే తమకు తెలియదని చెబుతున్నారని, తన కుమారుడు ఎక్కడున్నాడో వారిద్దరికీ తెలుసని జ్యోతి ఫిర్యాదు చేసింది. నులకపేటకు చెందిన కుమారి తన కుమార్తె ప్రగతి ఈనెల 19వ తేదీ కిరాణా కొట్టుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, అదే ప్రాంతంలో నివాసముండే రాము అనే యువకుడు కిడ్నాప్ చేసినట్లు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ రమేష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. కాలువలో గుర్తు తెలియని సుమారు 40 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీవ్యాధి బాధిత విద్యార్థినికి ఆర్థికసాయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరానికి చెందిన తెత్తురాజు స్వాతి అనే బీటెక్ విద్యార్థినికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. విషయం వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి సంవత్సరం పాటు వైద్య ఖర్చులు, టెస్టులకు అయ్యే రూ.73,200ను అరండల్‌పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో శనివారం అందచేశారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

దుగ్గిరాలలో విస్తృతంగా పర్యటించిన సమన్వయకర్త గంజి చిరంజీవి



టీ తాగుతూ గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గంజి చిరంజీవి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల గ్రామ పరిధిలో పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి శనివారం విస్తృతంగా పర్యటించారు. పాసింజర్ ఆటోలు, గూడ్స్ ఆటోల ఓనర్లు, డ్రైవర్ల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిర్ణీత సమయాల్లో వారి కుటుంబ సభ్యులకు అందుతున్నాయా.. లేదా ? అడిగి తెలుసుకున్నారు. ఆటోలు నిలుపుకోవడానికి స్థలం కావాలని డ్రైవర్లు ఆయన దృష్టికి తెచ్చారు. తహసీల్దార్‌తో మాట్లాడి స్థలాన్ని కేటాయించేవిధంగా చూస్తానని చిరంజీవి హామీ ఇచ్చారు. అనంతరం రైలు పేటలోని ఓ స్టాల్‌లో కూర్చుని టీ తాగారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, తక్షణమే పరిష్కరించే పనుల గురించి గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే అధికారులతో మాట్లాడి, వెంటనే ఆ సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), పార్టీ మండల కన్వీనర్ శృంగారపాటిరత్నం, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వెంకటేశ్వరరావు నాయక్, సుభాని పాల్గొన్నారు.

కన్న కొడుకుని చూసి తిరిగొస్తుండగా మృత్యువాత

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడికొండ: ఇద్దరు ఆడపిల్లల తర్వాత కొడుకు పుట్టాడన్న సంతోషంతో ఓ తండ్రి ఆగమేఘాల మీద అత్తారింటికి వెళ్లాడు. పొత్తిళ్లలోని ముక్కుపచ్చలారని కొడుకుని చూసి తిరిగి వస్తుండగా, మృత్యువు దారి కాచి రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పచ్చని సంసారంలో చిచ్చు పెట్టింది. ఈ విషాద ఘటన శనివారం తుళ్లూరు మండలం సీడ్ యాక్సిస్ రోడ్డుపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరానికి చెందిన జెట్టి రాజేష్ (30) రాయపూడి గ్రామానికి చెందిన మహిళతో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. గతంలో వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, నెల రోజుల కిందట కుమారుడు పుట్టాడు. అతడ్ని చూసి వచ్చి వెళుతూ, మార్గంమధ్యంలో రాయపూడి-దొండపాడు మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కనున్న ఇనుప పైపులను ఢీకొని మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయునున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు.

చేనేతకు ప్రభుత్వ చేయూత అవసరం

ఏఎన్‌యూ మాజీ వీసీ కేవీఎస్ రావు



సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు

మంగళగిరి: ప్రభుత్వాల విధానాల కారణంగానే చేనేత పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, చేనేతను ఆదుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి కేవీఎస్ రావు కోరారు. పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా చేనేత రంగ నిపుణుల సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద రంగమైన చేనేత రంగం ప్రభుత్వాల విధానాల కారణంగా నిరాదరణకు గురవుతోందని చెప్పారు. 1987, 88లో తొలిసారిగా ఆల్ ఇండియా సంస్థకు సంబంధించి హ్యాండ్లూమ్‌లో ఎంత మంది ఉన్నారని అధ్యయనం చేయగా అప్పుడు 40 లక్షల మంది ఉండగా, ఈ రోజు వారి సంఖ్య 20 లక్షలకు పడిపోయిందని పేర్కొన్నారు. 50 ఏళ్ల పైబడిన వారు మాత్రమే చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. 13వ రాష్ట్ర మహాసభలు వేదికకు చేనేత నాయకులు చిమ్మన నాగభూషణం, అందే నరసింహారావు పేర్లతో ఏర్పాటు చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేనేత పరిశ్రమకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి రూ.200 కోట్లకు పరిమితం చేయడం దుర్మార్గమని చెప్పారు. కార్యక్రమంలో చేనేత నిపుణులు డి.నరసింహారెడ్డి, సంఘం నాయకులు ఎం.నాగేశ్వరరావు, బి.ఆనంద్‌ప్రసాద్, ఈ.శివరామ్, పి.బాలకృష్ణ, పి.నాగేశ్వరరావు, ఆర్.పూర్ణచంద్రరావు, కె.కోటేశ్వరరావు, జె.వరప్రసాద్, చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు.

సంప్రదాయ సంగీతం అభివృద్ధికి కృషి



యువ పురస్కారంతో సత్కారం

నగరంపాలెం: సంప్రదాయ సంగీతం అభివృద్ధికి నిరంతర కృషి చేయడం అభినందనీయమని న్యాయవాది జూపూడి వెంకటకుమార్‌యజ్ఞదత్ అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై సంగీత సభ జరిగింది. విశ్రాంత లెక్చరర్ తులశమ్మ, వైద్యురాలు జి.నీలిమజ్యోతి జ్యోతి ప్రకాశనంతో సభను ప్రారంభించగా, డాక్టర్ పి.విజయ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథి వెంకటకుమార్‌యజ్ఞదత్ మాట్లాడుతూ యువతను సంస్థ ప్రోత్సహించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం విదుషీ వ్యాకరణం గాయత్రీ విభావరికి గాయత్రీ యువ సంగీత రత్న బిరుదు- యువ పురస్కారంతో సత్కరించారు. వ్యాకరణం గాయత్రీ విభావరి వాయులీన సోలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించగా, మృదంగంపై విద్వాన్ ఎస్.హరిహరన్ (చెన్నై) చక్కటి వాయిద్యాన్ని అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షురాలు పాటిబండ్ల లలిత, మాధవపెద్ది విజయలక్ష్మి, కార్యదర్శి ఎ.మంగాదేవి, ఉప కార్యదర్శి మాధవీకృష్ణ పాల్గొనగా, అతిథులు, కళాకారులను సత్కరించారు.

ఆర్డీ శోభారాణి సేవలు ఆదర్శనీయం



గుంటూరు మెడికల్: మూడో జోన్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.శోభారాణి కృషి ఆదర్శనీయమని ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నాయకులు కొనియాడారు. శనివారం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కూరపాటి సత్యంరాజ్, బడుగు శివాజీ, ప్రశాంతి, కరుణకుమార్, సుజాత, చంద్రశేఖర్, హరికృష్ణ, తిరుపతిరావు, శివచంద్ర, గోపి తదితరులు ఆర్డీ కార్యాలయంలో డాక్టర్ జి.శోభారాణిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటూ, సమస్యలను పరిష్కరించడంలో ఆమె కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుంటారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిర సమీపంలో రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు క్యాన్స్ ద్వారా ఇప్పటివరకు మంచినీటి సరఫరా జరిగేదని తెలిపారు. నూతన ప్లాంట్ ఏర్పాటుతో గంటకు 500 లీటర్ల మంచి నీటిని పొందవచ్చని చెప్పారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజల మంచినీటి సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. కలెక్టర్, జేసీలు నీటిని తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు వచ్చే వారంతా ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే 'రెడ్ క్రాస్' లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మంగళగిరి: రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్ తెలిపారు. నగరంలోని కార్యాలయంలో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ద్వితీయ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. 2022–23 వార్షిక, ఆర్థిక నివేదిక, 2024–25 సంవత్సర ప్రణాళిక, పరిసర ప్రాంతాల ప్రజలకు రానున్న సంవత్సరంలో అందించాల్సిన సేవలపై పలు తీర్మానాల్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సొసైటీ చైర్మన్ ఇసునూరి చక్రవర్తి తెలిపారు. గత ఏడాది వివిధ సందర్భాలలో ప్రజలకు అనేక సేవలందించడంతో పాటు కృత్రిమ చేతుల పంపిణీ మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా శాఖ పి. రామచంద్రరాజు, ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళి, షేక్ సలార్, గుంటి నాగరాజు, ప్రగడ రాజశేఖర్, పారేపల్లి నిరంజన్ గుప్తా, అందే రేవంత్ పాల్గొన్నారు.

ర్యాంకుల చదువులతో యువత క్రీడలకు దూరం

మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దయాసాగర్, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్

తాడికొండ: నేటి డిజిటల్ యుగంలో యువత ర్యాంకుల వెతుకులాటలో పడి సంప్రదాయ క్రీడలకు దూరం అవుతున్నారని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ముగింపు వేడుకలు శనివారం తాడికొండ సత్యసాయి హైస్కూలు ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దయాసాగర్ మాట్లాడుతూ చదువుల వేటలో సంప్రదాయ క్రీడలకు యువత దూరమవ్వకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రూ. కోట్లు వెచ్చించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పోటీల్ని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా పోటీలు సువర్ణావకాశమని తెలిపారు. అనంతరం క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన మండల స్థాయి జట్టులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ దొడ్డా సుధాకర్, ఇన్‌చార్జి ఈవోఆర్డీ అరుణ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో 'స్వచ్ఛ భారత్'



దేవస్థానాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు దానబోయిన వెంకట శివాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు స్వచ్ఛ అభయాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థాన పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేసినట్లు చెప్పారు. ఆలయం చుట్టూ ఉన్న చెత్తను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చుండూరు ఉమామహేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకట రెడ్డి, అర్చకులు చెన్నంశెట్టి సీతారాంబాబు, దానబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగులను ప్రాధాన్యతా వర్గంగా గుర్తించాలి



సబ్ ట్రెజరీ అధికారి షేక్ మస్తాన్‌కు మెమోరాండం అందజేస్తున్న బాల చంద్రమౌళి తదితరులు

తాడేపల్లి రూరల్: ఉద్యోగులను ప్రాధాన్యతా వర్గంగా గుర్తించి, గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్ని అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాల చంద్రమౌళి కోరారు.దుగ్గిరాలలో శనివారం జరిగిన సమావేశంలో పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల్ని ఉద్యోగులకు చెల్లించాలని సబ్ ట్రెజరీ అధికారి షేక్ మస్తాన్ గుంషావలికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిటీ వేసి నెలలు గడుస్తున్నా ఫలితం లేదని తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల యూనిట్ సహ అధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్, వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, సంయుక్త కార్యదర్శి బొల్లంపల్లి బుజ్జి, కొల్లపూడి నటరాజ్ పాల్గొన్నారు.

బాలుడి మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: బాలుడు మృతిచెందిన ఘటనపై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడంటూ ఆరోపించారు. సేకరించిన సమాచారం మేరకు పేరేచర్ల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ కుమారుడు ఎనిమిది సంవత్సరాల అఖిల్ మూడురోజుల క్రితం ఇంటి మేడపై గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. తల్లిదండ్రులు బాలుడిని జీజీహెచ్‌లోని పిల్లల విభాగంలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు వైద్యులను మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్యులు స్కానింగ్ తీసి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కాని ఆపరేషన్‌ను వాయిదా వేశారు. అఖిల్ శుక్రవారం మృతిచెందగా, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతిచెందాడని కిరణ్‌కుమార్ ఆరోపించాడు. అయితే న్యూరో సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ ఘటనపై వివరణ ఇస్తూ బాలుడికి పూర్తి స్థాయిలో వైద్యం అందించామన్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్న సమయంలోనే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని నిర్ణయించామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

చక్కటి దరహాసం కాదంత కష్టం!

- రేపు ప్రోస్తో డెంటిక్స్ డే
- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- జీజీహెచ్‌లో కాస్మోటిక్ వైద్యసేవలు



గుంటూరు మెడికల్: మనిషి జీవించాలంటే గాలి, నీరు తరువాత ఆహారం తప్పనిసరి. ఆహారాన్ని నోటి ద్వారా దంతాలతో నమిలి తీసుకుంటాం. దంతాలు ఆహారం తీసుకునేందుకు సహకరించకపోతే ఆ బాధ వర్ణించటం కష్టం. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన ప్రజానీకం ముఖ్యంగా నగరంలోని ప్రజలు తీవ్ర దంత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, కొద్దిపాటి సమస్య ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో దంత సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. జనాభాలో నూటికి 90 శాతం మంది తమ జీవిత కాలంలో ఏదొక సమయంలో దంత సమస్యల బారిన పడుతుంటారు. ఈ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, దంత వైద్యంలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి ఏడాది జనవరి 22న వరల్డ్ ప్రాస్టోడెంటిక్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కాస్మోటిక్ వైద్య పద్ధతులు..

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప, వేరే ఆలోచన ఉండేదికాదు. నేడు దంత వైద్యశాస్త్రం (డెంటిస్ట్రీ) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను సైతం పీకే పని లేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. కృత్రిమ పళ్ల అచ్చం సహజమైన దంతాల మాదిరిగానే కనిపించేలా సైతం అందంగా అమర్చుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో దంతాలు కోల్పోయిన వారికి కృత్రిమ పళ్లసెట్స్‌తో ఏ మాత్రం ఇబ్బంది లేకుండా సాధారణ జీవనం గడిపేలా చేస్తున్నారు. నేడు పన్ను పీకకుండా రూట్ కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పుచ్చిపోయిన పంటిని శుభ్రం చేసి అందులో సిమెంటమ్, సిల్వర్ మెటల్‌ను పెట్టి నొప్పి తగ్గించే విధానం అందుబాటులో ఉంది. పాచిపట్టిన, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వారా శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు లేనివారికి (ఊడిపోయినవారికి) ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు, షుగర్ వల్ల దంతాలు ఊడిపోతున్నవారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు పళ్లు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మోటిక్ బ్రెసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా, ఎగుడుదిగుడుగా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మోటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాలను అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం..

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 40 నుంచి 50 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాలను సిమెంటమ్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన దంతాలను కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గారపట్టిన దంతాలను క్లీనింగ్ చేయడం వంటివి చేస్తున్నారు. పెద్దాసుపత్రిలో స్పెషాలిటీ వైద్యనిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. సాధారణ దంత వైద్యసేవలతోపాటు, ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నారు.

దంత వైద్యంపై పెరిగిన అవగాహన



ఒకప్పుడు దంత వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇళ్లలోనే వైద్యం చేసుకునేవారు. నేడు ప్రజలకు కొంత మేరకు దంత వైద్యంపై అవగాహన పెరిగింది. దంత వైద్యంలో కాస్మోటిక్ సేవలు రావడం, ప్రజలు దంత వైద్యంపై అవగాహన కలిగి ఉండటంతో దంత వైద్యులకు బాగా డిమాండ్ పెరిగింది. ఒక్కో వైద్యుడు ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. పళ్ల కోల్పోయిన వారు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా కృత్రిమ దంతాల ద్వారా జీవితాన్ని హాయిగా గడిపివేయవచ్చు.

– డాక్టర్ చింతా వాసవి, దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

దంత వైద్యంలో ఆధునిక చికిత్సలు



దంత వైద్యంలో నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. డెంటల్ పీజీ స్పెషాలిటీ వైద్యసేవలకు నేడు బాగా డిమాండ్ ఉంది. ప్రతి ఒక్కరు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే దంత వైద్యులను సంప్రదించటం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత వైద్య సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి దంత వైద్యులను సంప్రదించాలి. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నీళ్లతో పుక్కిలించాలి.

– డాక్టర్ రేపూరి లక్ష్మి, దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఇ.మాధవి మాట్లాడుతూ 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం సామాజిక చైతన్యం' అనే అంశంపై ఫిబ్రవరి 14, 15 తేదీలలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, విభాగం అధ్యాపకులు ఆచార్య కృష్ణారావు, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్, తెలుగు విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.